## గురువుల అడుగుజాడల్లో విద్యార్థులు ముందుకు సాగాలి



- గురు పౌర్ణమి రోజు తన కంటి వేణుగోపాల్ రెడ్డి - హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా

**మదనపల్లి పెన్ పవర్ జూలై 10 :** ములకలచెరువు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హ్యూమన్ రైట్స్ ప్రొడక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ విజిలెన్స్ చైర్మన్ పేరెంట్ టీచర్స్ ఆత్మీయ సమ్మేళ నంలో తమ యొక్క అమూల్యమైన సందేశాన్ని విద్యార్థులకు అంద జేశారు. తన కంటి వేణుగోపాల్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నిత్యం విద్యార్థులు ఇతరులలో ఉన్నటువంటి లోపాలను గుర్తించకుండా తమ యొక్క నైపుణ్యాలను వినియోగించుకుంటూ గురువుల యొక్క అడుగుజాడలలో ముందుకు సాగాలని తెలియజేశారు. తరువాత బహుమతి, బోధన, భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు.




పెన్ పవర్


వై.ఎస్.ఆర్. కడప

అన్నమయ్య జిల్లా

# కాసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు చెప్పిన సీఎం

## - పుట్టపర్తిలో మెగాపేరెంట్ టీచర్ మీటింగ్ 2.0 కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు - తల్లి పేరిట ఒక మొక్క నాటేలా విద్యార్థులకు మొక్కలు, గ్రీన్ పాస్ పోర్టుల పంపిణీ - విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన సీఎం, మంత్రి లోకేష్








**సత్యసాయి జిల్లా, పెన్ పవర్ పుట్టపర్తి జూలై 10 :** విద్యార్థులు ఉద్యోగాలకు మాత్రమే పరిమితం కాకుండా రాజకీయాల్లోకి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజాప్రతినిధులుగా ప్రజలకు మంచి సేవలందించాలని ఆకాంక్షించారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల తల్లితండ్రులు- ఉపాధ్యాయులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ముందు పుట్టపర్తిలోని కొత్తచెరువు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. కేంబ్రిడ్జి, స్టాన్ ఫర్డ్ లో చదువుకున్న రాజకీయాల్లోకి వచ్చి నారా లోకేష్ ఇప్పుడు విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చూస్తున్నారని సీఎం అన్నారు. ఆధునిక దేవాలయాలైన పాఠశాలలను పరిరక్షించుకునే బాధ్యత మన అందరిదీ అని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో రెండో సారి విద్యార్థుల తల్లితండ్రులు- ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించిన విద్యాశాఖ మంత్రి లోకేష్ ను అభినందిస్తున్నానని అన్నారు. గురు పౌర్ణమి రోజునే రాష్ట్రవ్యాప్తంగా 61 వేల పాఠశాలల్లో 2.28 కోట్ల మందితో ఈ సమావేశం నిర్వహించడం సంతోషాన్ని కలిగిస్తోందని .. ఇది గిన్నీస్ రికార్డుల్లోకి ఎక్కుతుందన్నారు. మంత్రి లోకేష్ విద్యార్థిగా ఉన్న సమయంలో తాను కూడా పాఠశాల నిర్వహించే పేరెంట్స్ మీటింగ్ కు వెళ్లలేక పోయానని అన్నారు. తన సతీమణి భువనేశ్వరి ఏ సమావేశాన్ని విడవకుండా వెళ్లి లోకేష్ ను కేంబ్రిడ్జిలో చదివించేంత వరకూ శ్రద్ధపెట్టారన్నారు. తల్లి తండ్రులు కూడా తమ పిల్లల పట్ల శ్రద్ధ వహించి వారి కెరీర్ ను తీర్చిదిద్దటంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. మహిళల ఆర్థిక సామాజిక వికాసానికి పనిచేసే ప్రభుత్వంగా గతంలో డ్వాక్రా సంఘాలనే బలమైన పొదుపు వ్యవస్థను రూపకల్పన చేసి వారి అభివృద్ధికి తోడ్పాడ్డామని అన్నారు. ఇప్పుడు ప్రతీ కుటుంబంలోని పిల్లలందరినీ చదివించాలనే లక్ష్యంతో తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా వారందరికీ ఈ పథకాన్ని వర్తింప చేసి ఆ కుటుంబాల్లో వెలుగులు తీసుకువచ్చామని అన్నారు.

**విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే బాధ్యత లోకేష్ దే :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరి భవిష్యత్తునూ తీర్చిదిద్దే విద్యాశాఖ బాధ్యతను మంత్రి లోకేష్ ఏరికోరి తీసుకున్నారని సీఎం అన్నారు. స్టాన్ ఫర్డ్ , కేంబ్రిడ్జి లాంటి విద్యా సంస్థల్లో చదువుకున్న ఆయన రాష్ట్రంలోని విద్యార్థులకూ మంచి నాణ్యమైన విద్యను అందిస్తారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రైవేటు స్కూల్లకు ధీటుగా తీర్చిదిద్దే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు . దీనిపై సీఎం మాట్లాడుతూ " గత ఏడాది మొదటి విడత పేరెంట్ టీచర్ మీటింగ్ ను 44 వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలల్లోనే నిర్వహించాం. ఈసారి ప్రైవేటు స్కూళ్లలో సైతం మీటింగ్ లు నిర్వహించా జరిపేలా చూశామని సీఎం అన్నారు. నెల్లూరులోని ఓ ప్రభుత్వ పాఠశాలలో సీట్లు ఖాళీ లేవని నో వేకెన్సీ బోర్డు పెట్టారంటే విద్యా నాణ్యత ఎలా ఉందో అర్ధం చేసుకోవచ్చు. ప్రభుత్వ పాఠశాలలో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులకు అత్యుత్తమ నైపుణ్యం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0 కు 2.28 కోట్ల మంది హాజరయ్యారు. గిన్నీస్ రికార్డు సాధించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాం. తల్లి పేరిట ప్రతీ విద్యార్థి ఒక మొక్క నాటేలా చర్యలు తీసుకున్నాం. మొక్కను సంరక్షిస్తూ పురోగతి నమోదు చేసేలా గ్రీన్ పాస్ పోర్టు కూడా ఇచ్చాం. విద్యార్థుల హాజరు, మార్కులు, ప్రవర్తన ఇలా అన్ని అంశాలను లీప్ యాప్ ద్వారా అందిస్తున్నాం. విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాం, బూట్లు, బెల్టు, బ్యాగ్ లు ఇచ్చాం. విద్యార్థులకు ఇచ్చిన కిట్లపై ఎలాంటి వ్యక్తుల ఫోటోలు పెట్టలేదు. వీటి కోసం రూ. 980 కోట్లు వ్యయం చేశాం. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా నాణ్యమైన సన్నబియ్యంతో మధ్యాహ్న బోజనం పెడుతున్నాం" అని అన్నారు. విద్యార్థుల్లో ప్రతిభ వెలికి తీసి వారిని ప్రోత్సహించేలా షైనింగ్ స్టార్స్ పేరిట అవార్డులు ఇస్తున్నామని.. ఈ విద్యార్థులకు నచ్చిన కళాశాలల్లో చదువుకునేలా ప్రణాళిక చేస్తామని సీఎం స్పష్టం చేశారు. రాబోయే కాలంలో భవిష్యత్ అంతా నాలెడ్జి ఎకానమీదేనని దానిని అందిపుచ్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అన్నారు.

**డీఎస్సీలతో ఉపాధ్యాయుల నియామక ఘనత మాదే :** కూటమి అధికారంలోకి వస్తూనే 16,347 పోస్టులతో మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేశామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆగస్టు లోగా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారంతా శిక్షణ తీసుకుని పాఠశాలలకు వస్తారని సీఎం వివరించారు. గతంలోనూ 12 సార్లు డీఎస్సీలు వేసి 1.66 లక్షల మంది ఉపాధ్యాయులను నియమించిన ఘనత తమదేనని అన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని అన్నారు. గత ఐదేళ్లలో టోఫెల్, ఐబీ సిలబస్ పేరిట గందరగోళ పరిచారని ఏ ఒక్కటీ అమలు చేయలేదని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయుల బదిలీలను కూడా పారదర్శకంగా నిర్వహించామని అన్నారు. విద్యాశాఖలో అమలు చేస్తున్న సంస్కరణలతో పాటు వ్యవస్థను మెరుగు పర్చేందుకు తల్లితండ్రులు , ఉపాధ్యాయుల అందరి నుంచి సూచనలు తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో విశాఖ ఏజెన్సీలో పెద్ద ఎత్తున గంజాయి పండించారని.. డ్రగ్స్ కు కేంద్రంగా రాష్ట్రాన్ని మార్చారని సీఎం అన్నారు. రాష్ట్రంలో గంజాయి డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపామని పండించినా, విక్రయించినా అదే వారికి చివరి రోజు అవుతుందని సీఎం హెచ్చరించారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమం ద్వారా ఈ మహమ్మారిని నియంత్రించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. మత్తుపదార్థాలు విక్రయించేవారి ఆస్తుల స్వాధీనంతో పాటు ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాలు రాకుండా కట్టడి చేస్తామని అన్నారు.

**వనరుల సద్వినియోగంపై విద్యార్థులకు పాఠం :** విద్యార్థుల తల్లితండ్రులు- ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం 2.0 లో భాగంగా విద్యాశాఖ మంత్రి లోకేష్ తో కలిసి కొత్తచెరువు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులు- వారి తల్లి తండ్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. తొలుత పాఠశాల ఆవరణలో విద్యార్థులు చిత్రించిన తల్లికి వందనం పోస్టర్లు, కళారూపాలను సీఎం తిలకించారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ లోగో తో రూపొందించిన పోటో ఫ్రేమ్ లో సీఎం మంత్రి లోకేష్ , ఎన్సీసీ కేడెట్ లతో కలిసి ఫోటో దిగారు అనంతరం విద్యార్థులు, వారి తల్లితండ్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ముచ్చటించారు. విద్యార్థుల తల్లితండ్రులకు, విద్యార్థికి ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చిన సీఎం, మార్కులు పెంచుకుని ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. విద్యార్థులు హాజరు, మార్కుల వివరాలను స్వయంగా తల్లితండ్రులకు వివరించి కౌన్సిలింగ్ చేశారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల వివరాలను తెలియచేసేలా సమాచారం పంపుతున్నామని విద్యాశాఖ మంత్రి లోకేష్ సీఎంకు వివరించారు. విద్యార్థులను పాఠశాలకు నిరంతరం పంపేలాకూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సాయం చేస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అనంతరం పాఠశాలలోని తరగతి విద్యార్థులకు చెందిన తరగతి గదిని పరిశీలించి వారితో మాట్లాడిన ముఖ్యమంత్రి ..విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించి వారిలో స్ఫూర్తిని నింపేలా దిశానిర్దేశం చేశారు. తర్వాత పాఠశాలలోని 8 తరగతి గదిలోకి వెళ్లిన సీఎం కాసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠం చెప్పారు. సోషల్ సైన్స్ లోని వనరులు అనే పాఠాన్ని విద్యార్థులకు బోధించారు. మరోవైపు విద్యార్థులతో కలిసి బెంచిపై కూర్చున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ .. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన సోషల్ సైన్స్ పాఠాన్ని శ్రద్ధగా విన్నారు. సహజ వనరులు, పునరుద్పాదక, పునరుత్పాదకం కాని వనరుల గురించి సీఎం విద్యార్థులకు వివరించి చెప్పారు. సుస్థిరమైన అభివృద్ధి సాధించాలంటే వనరుల సద్వినియోగం అవసరమని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు చదువుకునే పాఠ్యపుస్తకాలను కూడా ఇతరులు మరోమారు వినియోగించుకునేలా జాగ్రత్తగా వాడాలని సీఎం సూచనలు చేశారు. విద్యుత్, నీరు లాంటి వనరుల సద్వినియోగం సామాజిక బాధ్యత అంటూ విద్యార్థులకు వివరించి చెప్పారు. కొత్త ఆలోచనలు, ఆవిష్కరణల వైపు విద్యార్థులు దృష్టి పెట్టాలని దిశానిర్దేశం చేశారు.


**విద్యార్థులతో కింద కూర్చుని మధ్యాహ్న బోజనం చేసిన సీఎం :** గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసి పారిపోయిందని ఇప్పుడు అసలు, వడ్డీ కలిపి చెల్లించాల్సి ఉందని సీఎం అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మరోవైపు పుట్టపర్తి లో స్టేడియం నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేస్తున్నట్టు సీఎం పేర్కొన్నారు. కొత్తచెరువు పాఠశాల స్థల దాత, భవనాన్ని నిర్మించి ఇచ్చిన పీవీ సూర్యనారాయణ, పార్వతమ్మ దంపతులను ముఖ్యమంత్రి సత్కరించారు. మరోవైపు డ్రగ్స్ వద్దు బ్రో అంటూ సమావేశంలో నినదించి విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు . అనంతరం తల్లి పేరిట ఒక మొక్క నాటేలా విద్యార్థులకు ముఖ్యమంత్రి మొక్కలను పంపిణీ చేశారు. వాటి పురోగతిని నమోదు చేసేలా గ్రీన్ పాస్ పోర్టును కూడా అందించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులంతా ముఖ్యమంత్రి సమక్షంలో తమ తల్లులకు నమస్కరించి వారి నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం కొత్త చెరువు జెడ్పీ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని వారితో కలిసి కింద కూర్చుని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరగించారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ సైతం అక్కడే విద్యార్థులతో కలిసి మధ్యాహ్న బోజనాన్ని తిన్నారు. పాఠశాలలో విద్యార్థులకు పెడుతున్న ఆహార పదార్థాల నాణ్యత, రుచి బాగుందని సీఎం కితాబిచ్చారు.

# గురు పౌర్ణమి గురువుల ద్వారా శిష్యులకు....

- సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి







**చేగూరు కన్హా పెన్ పవర్ జూలై 10 :** దర్పణాలు మనకు ఆకృతులను చూపిస్తాయి, స్వీయ అధ్యయనం మనకు ఏమి చూపిస్తుంది? దివ్య దర్పణం... ఒకానొకప్పుడు గురుకులంలో, ఒక ఆచార్యుడు తన శిష్యుని సేవకు చాలా ముగ్ధుడయ్యాడు. విద్యాభ్యాసం పూర్తి చేసి, ఆ శిష్యుడు వెళ్లిపోయేటప్పుడు, గురువు అతనిని ఆశీర్వదించి, ఒక దర్పణం బహుమతిగా ఇచ్చాడు. అది మామూలు దర్పణం (అద్దం) కాదు. వ్యక్తి యొక్క అంతరంగిక భావాలను ప్రతిబింబించగలిగే దివ్య దర్పణం. గురువు గారి నుండి ఈ బహుమతిని స్వీకరిస్తూ, శిష్యుడు చాలా సంతోషించాడు. వెళ్లేముందు ఆ దర్పణ సామర్థ్యాన్ని చూడాలి అని అనుకున్నాడు. ఆ దర్పణాన్ని పరీక్షించాలనే తొందరలో ముందుగా దాన్ని తన గురువుగారి వైపు తిప్పాడు. శిష్యుడు ఆశ్చర్యపోయాడు. బంధనాలు, అహంకారం, కోపం మొదలైన ఎన్నో బలహీన గుణాలు గురువుగారి హృదయంలో స్పష్టంగా గోచరించటం ఆ దర్పణం చూపించింది. నాకు ఆదర్శమైన నా గురువుగారు చాలా లోపాలతో నిండి ఉన్నారు!' అని దీన్ని తలచుకుని చాలా బాధపడ్డాడు. బరువెక్కిన హృదయంతో దర్పణం తీసుకుని గురుకులాన్ని విడిచిపెట్టాడు కానీ దారి పొడవునా ఆ ఆలోచన మాత్రం అతని మనసును వదలలేదు. అతను తన గురువుగారు ఎటువంటి లోపాలు లేని ఒక ఆదర్శవంతమైన వ్యక్తిగా భావించాడు,... కానీ అద్దం అదే గురువుగారి గురించి పూర్తిగా విభిన్నమైన విషయాన్ని వెల్లడించింది. ఇప్పుడు తన చేతిలోకి ఇతరులను పరీక్షించే పరికరం వచ్చింది కాబట్టి, ఎవరు కనిపిస్తే వారిని పరీక్షించడం మొదలుపెట్టాడు. తన ప్రాణ స్నేహితులను, ఇతర పరిచయస్తులలో చాలామందిని - దర్పణం వారి వైపు పెట్టి చూస్తూ వారిని పరీక్షించాడు. ప్రతీ ఒక్కరి హృదయంలోనూ ఏదో ఒక దుర్గుణం కనిపించేది. అతని అనుభవాలన్నీ చాలా బాధాకరమైనవిగా ఉన్నాయి. ఈ లోకంలో అందరూ ఎందుకు ఇంత చెడ్డవాళ్లుగా మారారు అని ఆలోచిస్తూ ఉన్నాడు. ప్రతీ ఒక్కరూ అనిశ్చితంగా, రెండు రకాల మనఃప్రవృత్తులతో ఉన్నారు, ఎవరూ కళ్ళకు కనిపించినట్లుగా లేరు. ఈ నిస్సహాయ ఆలోచనలలో మునిగిపోయి, బాధాతప్త హృదయంతో, ఎలాగో ఇంటికి చేరుకున్నాడు. అప్పుడు తన తల్లిదండ్రుల గురించి ఆలోచించాడు. తన తండ్రికి సమాజంలో గొప్ప పేరుంది. తల్లి చాలా పవిత్రమైన స్త్రీగా, సాధ్వీగా పరిగణించబడుతుంది. 'వాళ్ళని కూడా పరీక్షించాలి' అని అనుకుని, అతను తన తల్లిదండ్రులను కూడా ఆ దర్పణంతో పరీక్షించాడు. వారి హృదయాలలో కూడా కొన్ని చెడు గుణాలు ఉన్నాయి. వారు కూడా దుర్గుణాల నుండి పూర్తిగా విముక్తి పొందలేదు. 'ఈ ప్రపంచమంతా అసత్యం మీదే నడుస్తోంది', అని నిశ్చయించుకున్నాడు. ఇప్పుడు శిష్యుడు తన మనసులోని అశాంతిని భరించలేకపోయాడు. ఆ దర్పణం పట్టుకుని గురుకులం వైపు నడిచాడు. త్వరగా అక్కడికి చేరుకుని నేరుగా తన గురువుగారి దగ్గరకు వెళ్ళాడు. గురువుగారు విషయం ఏమిటో ఊహించి, చూడగానే అతని మనస్సులోని వ్యాకులతను గ్రహించాడు. శిష్యుడు తన గురువుతో వినయంగా ఇలా అన్నాడు - "గురుదేవా, మీరు నాకు ఇచ్చిన దర్పణం సహాయంతో, నేను ప్రతీ ఒక్కరి హృదయంలో అనేక రకాల లోపాలు ఉన్నట్లుగా నేను గమనించాను, నేను ఇంతవరకు ఒక్క లోపం కూడా లేని వ్యక్తిని ఎందుకు చూడలేదు? మీలో, నా తల్లిదండ్రులలో కూడా నేను చాలా లోపాలను చూశాను అని చెప్పడానికి నేను చాలా చింతిస్తున్నాను. దీనితో నా మనసు చాలా కలతచెంది ఉంది." గురువుగారు నవ్వుతూ శిష్యుని వైపు దర్పణం తిప్పాడు. శిష్యుడు దిగ్భ్రాంతి చెందాడు. అతని మనసులోని ప్రతీ మూలా కూడా కోపం, ద్వేషం, అహంకారం వంటి చెడు లక్షణాలతో నిండిపోయి ఉంది. అతని హృదయంలో స్వచ్ఛత ఏ మూలా కనపడలేదు. గురువుగారు ఇలా అన్నారు - "నాయనా, ఇతరుల తప్పులను వెతకడానికి కాదు, నీ స్వంత తప్పులను చూసుకొని నీ జీవితాన్ని మెరుగుపరచుకోవడానికి నేను ఈ దర్పణం నీకు ఇచ్చాను. ఇతరులలోని లోపాలను కనుగొనడంలో గడిపిన సమయాన్ని నీవు స్వీయ-అధ్యయనంలో గడిపిఉంటే, ఇప్పటికి నీ వ్యక్తిత్వం చాలా పరివర్తన చెందిఉండేది." దర్పణంలో, మనం మన ఆకారాన్ని చూస్తాం, స్వీయ - అధ్యయనంలో మన అంతరంగాన్ని చూస్తాం. నాలో లోపాలను చూసుకుంటూ, ప్రతీ అడుగులో, క్షణ క్షణం వాటిని సరిదిద్దుకోవడానికి నేను ధైర్యంగా ఉండాలి.

దాజీజీ.. హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం